దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 19 : ఇటీవల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో 29వ అంశం దివ్యాంగులకు 6 వేల రూపాయల పెన్షన్, ఉచిత రవాణా సౌకర్యం, దివ్యాంగుల చట్టం పూర్తిస్థాయి అమలు వంటి హామీలను నెరవేర్చాలని కోరుతూ విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఉన్నత ఉద్యోగంలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్, సబ్ కమిటీ చైర్మన్ వంగ ఈశ్వర్, డైరెక్టర్ గాడి నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు పుర్ర బాల్‌రెడ్డి, నాయకులు కుర్ల లింగం, స్వామి, కొండల్‌రెడ్డి, మల్లయ్య, సిద్ధిరాములు,రా జు, మల్లేశం, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

మాచారెడ్డి, డిసెంబర్ 19 : ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని డీఆర్డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో సాయిబాబా, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో ఉన్న నర్సరీని డీఆర్డీవో సాయన్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వాహకులతో మాట్లాడారు. బ్యాగ్ ఫిల్లింగ్‌ను సక్రమంగా చేపట్టాలన్నారు. మొక్కలకు సరిపడా నీరు అందించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

దోమకొండ, డిసెంబర్ 19 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ గ్రామానికి చెందిన ఉసికె అశోక్(52) కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కుడి చెరువులో పడి మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారన్నారు. కూతురికి వివాహం అయిందని, కొడుకు చదువుకుంటున ట్లుగా తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 19: ఈత చెట్ల విషయంలో జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు సంబంధించిన ఈత చెట్ల విషయంలో అదే గ్రామానికి చెందిన ఈశ్వర్‌గౌడ్‌తో గొడవ జరిగింది. కోపంతో శ్రీనివాస్‌గడ్‌పై ఈశ్వర్‌గౌడ్ కత్తితో దాడి చేశాడు. దీంతో శ్రీనివాస్‌గౌడ్ కుడిచేయి, ముక్కుపై గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు చెప్పాడు.

శభాష్.. సదాశివనగర్ పోలీస్

- ఎక్కడో హత్యలు.. ఇక్కడ మృతదేహాలు..
- విచారించి దుండగులను పట్టుకుంటున్న పోలీసులు
- వరుస హత్యల నిందితులను పట్టుకొని అందరి మన్ననలు

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధూశర్మ

సదాశివనగర్, డిసెంబర్ 19: ఎక్కడో హత్య జరిగి.. ఇక్కడ మృతదేహాలను పడేస్తుండగా.. తమదైన శైలిలో విచారణ చేపట్టి దుండగులను పట్టుకుంటున్నారు సదాశివనగర్ పోలీసులు. దీంతో అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. పగలు, ప్రతీకారాలు, భూ తగాదాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రేమ పెండ్లీలు, వివాహేతర సంబంధాలు తదితర విషయాల్లో పలువురు హత్యకు గురవుతున్నారు. ఇతర ప్రదేశాల్లో హత్య చేసినా.. సదాశివనగర్ మండలంలో అటవీ ప్రాంతం ఉండడం, 44వ నంబర్ జాతీయ రహదారి కూడా మండలం మీదుగా వెళ్తుండడంతో మృతదేహాలను ఇక్కడికి తెచ్చి పారేస్తున్నారు. ఆనవాళ్లు తెలియకుండా వాటిని కాల్చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుంటున్న సదాశివనగర్ పోలీసులు.. లోతుగా విచారణ చేపట్టి హంతకులను గుర్తించి కటకటాల పాలు చేస్తున్నారు. ఇందుకు ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. తాజాగా మాక్లూర్ మండలానికి చెందిన ఆరుగురిని హత్య చేసిన కిల్లర్‌ను సైతం పోలీసులు పట్టుకున్నారు.

● పదేండ్ల క్రితం మెదక్ జిల్లా నర్సాపూర్ మండల గోమారానికి చెంది వ్యక్తిని భార్య, తమ్ముడు, బామ్మర్ది, మరో వ్యక్తి కలిసి హత్య చేశారు. కారులో తెచ్చి సదాశివనగర్ మండలంలోని మల్లుపేట్ గ్రామ శివారులో రాళ్ల మధ్య పడేశారు.

స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు.

● ఎనిమిదేండ్ల క్రితం నిజామాబాద్ వాసిని అత్త, భార్య, మరో వ్యక్తి కలిసి హత్య చేసి మృతదేహాన్ని పద్మాజివాడి– కల్వరాల్ శివారులో పడేశారు. అప్పటి సదాశివనగర్ ఎస్సై శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భార్య, అత్తను అదుపులోకి తీసుకొని కేసును ఛేదించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

● పదేండ్ల క్రితం అడ్లూర్ ఎల్లారెడ్డి విండో కార్యదర్శి అశోక్‌ను హత్య చేసిన దుండగులు మృతదేహాన్ని చెరువులో పడేశారు. పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారిని అరెస్టు చేసే సమయంలో.. అందులో అప్పటి ఓ ఎమ్మెల్యే బంధువులు ఉండడంతో రాజకీయ ఒత్తిళ్లతో నిందితులను వదిలేశారు. కాగా.. అశోక్ హత్య కేసు మిస్టరీ ఇప్పటికీ వీడలేదు.

● తాజాగా భూంపల్లి శివారులో హత్యకు గురైన మహిళ కేసును సీసీ పుటేజీ, ఫోన్ ఆధారంగా ఛేదించారు. ఈ కేసులో నిందితులు ఆరు హత్యలను చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసును ఛేదించిన సదాశివనగర్ సీఐ రామన్, ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ సింధూశర్మ ప్రత్యేకంగా అభినందించారు.

చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ దాసరి గంగారాం, మాజీ సర్పంచ్ చందర్, నాయకులుపా ల్గొన్నారు.

–చందూర్, డిసెంబర్ 19

హైస్కూల్‌ను పరిశీలించిన అధికారులు

చందూర్, డిసెంబర్ 19 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో పాఠశాలలో కల్పించిన మౌలిక వసతులు, డిజిటల్ క్లాసులను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏసీఎంవో శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

నస్రుల్లాబాద్, డిసెంబర్ 19 : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జనవరి 6 నుంచి 22వ తేదీ వరకు 15 రోజులపాటు నిర్వహించే ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన వారిని దరఖాస్తు చేసుకునేలా చూడాలని, మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు వెంకటేశం, నరహరి, విజయ్ కుమార్, శ్రీనివాస్, తహసీల్దార్ రాజు, గిర్దావర్ హన్మాండ్లు, సురేందర్, బూత్ లెవల్ అధికారులు, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

కామారెడ్డి, డిసెంబర్ 19 : బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వెంటనే డిక్లరేషన్‌కు చట్టబద్ధత అమలు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల మహేశ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు దయాకర్, నరేశ్, రాము, చారి, ప్రవీణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అభిషేకం టికెట్లు చోరీ

భిక్కనూరు, డిసెంబర్19 : భిక్కనూరు సిద్ధరామేశ్వరస్వామి అభిషేకం టికెట్లు చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి 8 గంటలకు టికెట్టు కౌంటర్ లాక్ చేసి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం 8 గంటలకు భక్తుల కోసం అభిషేకం టికెట్లు ఇవ్వడం కోసం చూడగా.. బుక్కు కనిపించలేదు. దీంతో మంగళవారం ఈవో శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్టీ కోసం పని చేయాలి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 19 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయడానికి సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక నాయకులు, కార్యకర్తలకు రాబోయే ఎన్నికల్లో పాటించాల్సిన పద్ధతులపై దిశానిర్దేశం చేశారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 19: లింగంపేట మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన డప్పు నవనీత తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యం అయినట్లు ఎస్సై ప్రభాకర్ మంగళవారం తెలిపారు. నవనీత పది రోజుల క్రితం ఇద్దరు కుమారులు శ్రీహాన్, ప్రణయ్‌ని తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి నర్సింహులు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాన్సువాడ ఎంసీహెచ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బాన్సువాడ మాతా–శిశు దవాఖానలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను దవాఖన సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి డాక్టర్లు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

– బాన్సువాడ టౌన్, డిసెంబర్ 19

మల్బరీ పంటను పరిశీలించిన ఎంపీడీవో

పంటను పరిశీలిస్తున్న ఎంపీడీవో సవితారెడ్డి

రామారెడ్డి, డిసెంబర్ 19: మండల కేంద్రానికి చెందిన బండి నాగరాజు, బండి రజిత సాగు చేస్తున్న మల్బరీ పంటను ఎంపీడీవో సవితా రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ధర్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. తమ రెండున్నర ఎకరాల్లో రైతులు సెరీకల్చర్ ద్వారా మల్బరీ పంటను సాగుచేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందజేశారు. మల్బరీ పంట సాగుచేసే రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలతోపాటు నిర్వహణ ఖర్చులను అందజేస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 19: మండలంలోని గండిమాసానిపేట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు సరోజ, భూమి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజులు, పీఈటీ అతీఖుల్లా మంగళవారం తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు అభినందించారు. నేటి(బుధవారం) నుంచి 23వ తేదీ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కొమరంభీం ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో విజయం సాధించి జిల్లాకు, పాఠశాలకుమ ంచిపేరు తేవాలని వారు ఆకాక్షించారు.

గుండెపోటుతో ఒకరి మృతి

డోంగ్లీ, డిసెంబర్19: మండలంలోని కుర్ల గ్రామానికి చెందిన నీలకంఠ్‌రావు పాటిల్ (58)కు సోమవారం సాయంత్రం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే బాన్సువాడకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నీలకంఠ్‌రావు పాటిల్ గతంలో డోంగ్లీ పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, అరుణతార, గంగారాం తదితరులు సంతాపం ప్రకటించారు.

క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య

పిట్లం, డిసెంబర్ 19: మండలంలోని బండపల్లితండాకు చెందిన పెల్య మోతీలాల్ (42) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మోతీలాల్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతిచెందాడు. మృతుడి భార్య సుందర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

రామారెడ్డి, డిసెంబర్ 19: మండలంలోని కన్నాపూర్ తండాలో ఇటుకబట్టీల వద్ద ఉన్న ఏడుగురు బడి బయటి పిల్లలను విద్యాశాఖ అధికారులు మంగళవారం గుర్తించారు. వారిని తండాలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సుప్పని సురేఖ, హెచ్ఎం ఆనంద్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 18: అయ్యప్పస్వామి సామూహిక మండల పడిపూజను ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నర్సింహశర్మ, సాయిశర్మ, ఆలయ పూజారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నిజామాబాద్ నుంచి వచ్చిన ఆర్టీసీ శ్రీను బృందం సభ్యులు ఆలపించిన భజన గీతాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్మాణంలో సహకరించిన మెట్లదాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎల్లారెడ్డి న్యాయమూర్తి హారిక, న్యాయవాది గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. దీక్షాధారులు, భక్తులకు ఎల్లారెడ్డి భక్త సమాజ్ సభ్యులు పొల్సాని సురేందర్ రావు, నారాయణసేట్, అర్జున్, ప్రకాశ్, హస్ముఖ్, సురేశ్ అల్పాహారాన్ని అందజేశారు.

శబరిమలకు బయల్దేరిన మాలధారులు ..

మండల దీక్షను ముగించిన పలువురు అయ్యప్ప మాలధారులు ఎల్లారెడ్డిలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి మంగళవారం శబరిమలకు బయల్దేరారు. గురుస్వామి చంద్రం వారికి ఇరుముడి కట్టారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాస్ రావు, గురుస్వాములు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోలి రాజ్‌కిరణ్, కాశి, కులకర్ణి శంకర్‌రావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే రివ్యూ

అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 13: పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఎల్లారెడ్డిలోని తన కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆరో గ్య శ్రీ, వైద్య, పశు సంవర్ధక, పౌరసరఫరాల శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారుల పనితీరు, ఆయాశాఖల వివరాలు తెలుసుకొని వారికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ డైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

పూజలు నిర్వహిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, డిసెంబర్19: జుక్కల్ మండలంలోని కథల్‌వాడి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మంగళవారం ప్రారంభించారు. ఎస్డీఎఫ్ ద్వారా పనులను చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. అంతకుముందు ఆయన హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

పిట్లంలో పారాయణం

పిట్లం, డిసెంబర్ 19: పిట్లంలోని బ్రహ్మంగారి ఆలయంలో మంగళవారం ఆలయ కమి టీ సభ్యులు 108 మందితో 108 సార్లు సా మూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మె ల్యే లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయడం శుభకరమని అన్నారు.

జీవన భృతి కల్పించాలి

గాంధారిలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

గాంధారి, డిసెంబర్ 19: మహాలక్ష్మీ పథకంతో నష్టపోతున్న తమకు ప్రభుత్వం జీవనభృతి కల్పించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. ఈమేరకు గాంధారిలో మంగళవారం మహాలక్ష్మీ పథకానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గి, ఆదాయం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు నెలకు రూ.15వేల జీవనభృతి కల్పించాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు కామెల్లి కృష్ణ, గంగాధర్, రవినాయక్, శేఖర్, గౌస్, పాషా, గోవర్ధన్, గంగారాజు, నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లకు సిద్ధమవుతున్న రైతాంగం

బాన్సువాడతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగి వరినాట్లకు రైతాంగం సిద్ధమవుతున్నది. వర్షాకాలం సీజన్ ముగియడంతో ముందస్తుగానే యాసంగి నారుమడులు వేసుకున్నారు. ఇటీవల నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు మొదటి దఫా విడుదల చేయడంతో కాలువ వెంట పంట పొలాల్లో నాట్లకు రైతులు దుక్కులు దున్ని ఉంచారు. మరో వారం రోజుల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతాయని రైతులు చెబుతున్నారు. – బాన్సువాడ, డిసెంబర్ 19

మహ్మద్‌నగర్ మండలంలో త్వరలో అన్ని వసతులు

నిజాంసాగర్, డిసెంబర్19: నూతనంగా ఏర్పాటైన మహ్మద్‌నగర్ మండలంలో త్వరలో అన్ని వసతులు కల్పిస్తామని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. నిజాంసాగర్ తహసీల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన సిబ్బందితో మాట్లాడారు. మహ్మద్‌నగర్ తహసీల్ కార్యాలయంలో త్వరలో సిబ్బంది నియామకం, ఫర్నిచర్‌తోపాటు వసతులు కల్పిస్తామని అన్నారు. తహసీల్దార్ భిక్షపతి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, గిర్దావర్ అంజయ్య ఉన్నారు.

నిజాంసాగర్ తహసీల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో

పోతిరెడ్డిపల్లి తండావాసికి నంది అవార్డు

అవార్డును అందుకుంటున్న ప్రకాశ్

పిట్లం, డిసెంబర్ 19: మండలంలోని పోతిరెడ్డిపల్లి గుడితండాకు చెందిన మలావత్ ప్రకాశ్‌కు నంది అవార్డు దక్కింది. పలు సీరియళ్లలో నటించిన ప్రకాశ్‌ను హైదరాబాద్‌లోని రుద్ర స్టూడియో వారు ఉత్తమ నటుడిగా గుర్తించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నంది అవార్డును అందజేశారు. శ్రీనివాస్‌కు అవార్డు రావడంపై గిరిజనులు, మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

CHANGE OF NAME

I, NARRA GOUTHAMI, D/o. NARRA MUTHENNA, H.No. 2-103/16/2, Kammarpally, (D) Nizamabad. Changed my Surname / Name as CHOUTI LAHARI

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును